# ఆత్మీయం

## - అంబల్ల జనార్ధన్

"అంగట్లవ్వా అంటే ఒడికుట్టినవ్ బిడ్డా అన్నట్టు, గాయిన టేషన్ కు రాకుంటే మన గతేంది?"

"నాకు చేతనయ్య సభావం ఎర్కే. గాయిన మాటిచ్చిండంటే తప్పకత్తడు." బైరయ్య లో భరోసా.

"మనదేశం గాని దేశం. మనబాస ఆల్లకు రాదు, ఆల్ల బాస మనకు తెలది. నేను రానే రానంటె పట్టుకత్తివి. గాయిన రాకపోతె యాడికోతం ఎట్లవోతం?" రత్తమ్మ ఆందోళన.

"గంత పెద్దమనిసి రమ్మని కారట్ల మీద కారట్లు రాత్తె పోకపోతె మంచిగుంటదే?"

"ఎప్పుడో యోడెనిమిదేండ్ల కింద మనూర్లె గొన్నేండ్లు ఉండి పొయినాయిన ఏదో మాట వరుసకు రాత్తె, ముల్లె మూట సద్దుకోని తయారౌడేనా? నాకైతె బయమైతున్నది" రత్తమ్మలో ఇంకా అనుమానం.

"చేతనయ్య ఆల్ల ఊరు అమ్దావాద్ వోయినంక పది కారట్లు రాసిండచ్చు. మొన్నైతె 'మీరు మములను మర్సిపోయిండ్రా? ఈ నెలలోపల రాకుంటె నేనే అచ్చి మిమ్ములను తోలుకచ్చుకుంట' అని నిట్టూరంగ రాసె. ఇగ నాకాగబుద్ధిగాలె. ఏమైతైందని బైలెల్లితిమి. నువ్వేం ఫికరు జెయ్యకు"

బైరయ్య, రత్తమ్మలది హైద్రాబాద్ నుండి రెండు వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న పల్లెటూరు.

గుజరాత్ కు చెందిన చేతన్ షా కొన్నేళ్ళ క్రితం, ఆ ఊళ్ళోని బ్యాంకుకి మానేజరుగా బదిలీపై వచ్చి, మూడేళ్ళకు పైగా ఉండి తిరిగి గుజరాత్ వెళ్ళిపోయాడు. అప్పుడు బైరయ్య దంపతులు వారికి అన్ని విషయాల్లో చేదోడు వాదోడుగా ఉన్నారు. ఎందరో చదువుకున్నవారూ, మోతుబరులు ఆ ఊళ్ళో ఉన్నా , చేతన్ షా కుటుంబనికి, ఏ మర్మ ఎరుగని అమాయకులైన బైరయ్య, రత్తమ్మలతోనే గాఢానుబంధం ఏర్పడింది.

www.sirimalle.com

గుజరాత్ తిరిగివెళ్ళి నాలుగైదు సంవత్సరాలు కావస్తున్నా, వారు బైరయ్య దంపతులు చేసిన సేవలు, సహాయాలు మర్చిపోలేదు. ముఖ్యంగా తన భార్య మణిబేన్ అనారోగ్యంగా ఉన్నప్పుడు రత్తమ్మ ఆమెను కంటికి రెప్పలా చూసుకున్న విషయం ఆ దంపతులు జీవితాంతం గుర్తుంచుకుంటారు. బైరయ్య దంపతులకు ఆతిథ్యమిచ్చి, ఆ రుణం కొంతైనా తీర్చుకోవాలనే తాపత్రయం వారిని అహ్మదాబాద్ రప్పించేలా చేసింది. ఎక్కడి ఆంధ్ర ప్రదేశ్? ఎక్కడి గుజరాత్ లోని అహ్మదాబాద్? ఇది ఏ నాటి రుణానుబంధమో! “అభీ అహ్మదావాద్ స్టేషన్ ఆనేవాలా హై” అని తోటి ప్రయాణికుడనగానే బైరయ్య, రత్తమ్మలు తమ సంచీలు తీసుకుని రైలు తలుపు వైపుకు కదిలారు.

వాళ్ళు ప్లాట్ ఫారంపై దిగగానే ఎదురుగా చేతన్ షా, వాళ్ళబ్బాయి. చేతుల్లో పూలదండలు!

ఓ పూలదండ బైరయ్య మెడలోవేసి గట్టిగా హత్తుకున్నాడు షా. వాళ్లబ్బాయి రత్తమ్మను సన్మానించాడు. బైరయ్య దంపతుల కళ్ళల్లో ఆనందబాష్పాలు!

వారి చేతుల్లోని సంచులు తీసుకుని తమ కారువైపుకి దారి తీసారు షా, వాళ్లబ్బాయి.

పాల్డి లోని తమ ఇంట్లోని ఒక గది బైరయ్య దంపతులకు కేటాయించారు షా కుటుంబం.

వారి స్నానాదులు కాగానే జీవితంలో ఎన్నడూ చూడని వంటకాలు ఆహ్వానం పలికాయి బైరయ్య దంపతులకు. విందు భోజనం తర్వాత భుక్తాయసం తీర్చుకున్న బైరయ్య దంపతులను నగర సందర్శనకు బయలుదేరదీసారు. కాంకరియా తలావ్, బాలవాటిక, మ్యూజికల్ ఫౌంటన్లు, అక్వేరియం చూపించి, ఒక ఏ.సీ. హోటల్లో భోంచేసి ఇంటికి చేరుకున్నారందరు. మర్నాడు ఉదయం మహాత్మా గాంధి గారి సాబర్మతి ఆశ్రమం వెళ్ళారు. మహాత్మా గాంధి గారి కళ్ళద్దాలు, రాట్నం, చెప్పులు, మొదలైన వస్తువులు చూసి కళ్ళల్లో నీళ్ళు పెట్టుకున్నారు బైరయ్య, రత్తమ్మ. సాయంత్రం, మన తెలుగు వారి నిర్వహణ లో సర్ఖేజ్ – గాంధినగర్ హైవే పైన ఉన్న భవ్యమైన, దివ్యమైన శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయన్ని దర్శించారు. తిరుమలలో ఉన్న అనుభూతి కలిగింది వారందరికి. మూడోరోజు జంతు ప్రదర్శనశాల, భద్రకాళి, మహంకాళి, క్యాంప్ హనుమాన్ మందిరాలు చూపించి , అహ్మదావాద్ సందర్శన పూర్తిచేసారు షా కుటుంబ సభ్యులు. నాలుగవ రోజు ఇంటిల్లపాదీ అహ్మదావాద్ స్టేషన్ వచ్చి , బైరయ్య, రత్తమ్మలకు ఆత్మీయ వీడ్కోలు పలికారు. బైరయ్య

www.sirimalle.com

దంపతుల కళ్ళల్లో మళ్లీ ఆనందబాష్పాలు! కృతజ్ఞతతో నిండిన కన్నీళ్లు! చేతన్ షా, మణిబేన్ కళ్ళల్లో కూడా తడి. కాని వాటిలో  బైరయ్య, రత్తమ్మలకు ఆతిథ్యమిచ్చి, వారి ఋణం కాస్తన్నా  తీర్చుకున్న తృప్తి. తమ సీట్లల్లో  స్థిరపడి, రైలు బయలుదేరగానే బైరయ్య, “నువ్వొత్తగ బుగులు వడితివి. చేతనయ్య, మణవ్వ, ఆల్ల పిల్లలు మనల్ని పువ్వుల్లెక్కజూసుకున్నరు. ఆల్ల కార్ల ఎన్నెక్కల్నో తీస్కపోయి ఏమేమో సూపిచ్చిరి. అమ్దావాద్ ల ఉన్నన్ని దినాలు మనం కలలగుడ జూడని దినుసులు కడుపునిండ తినవెట్టిరి. అచ్చేటప్పుడు పెయినిండ బట్టలు పెట్టిరి. ఇంకేం గావాలె?”

“ఈల్లు గింత మంచిగ జూత్తరని నాకేం ఎర్క? గప్పుడు ఐద్రబాద్ ల మీ మేనత్త కొడుకింటికివోతె ఏటుగుడ ఆల్ల దగ్గర పైసలున్నయని మనల్ను పురుగుల కంటె ఈనంగ జూసిరి. నాలుగు దినాలుందమనివోతె  రొండు రోజులకె పొరచ్చేటట్టుజేసిరి. మన సుట్టాలే గట్ల జేసినంక పరాయోల్లమీద ఎట్ల నమ్మికం బెట్టాలె? శేతనయ్య, ఆయిన పెల్లం పిల్లల కడుపు సల్లగుండ, మనల్ను రాజుల్లెక్క అర్సుకున్నరు. దేవుడాల్లకు ఇంకా బర్కతియ్యాలే. ఆల్లు గిట్లనె మనసుంటోల్లను దగ్గరదీయాలె.” అని రత్తమ్మ  రెండు చేతులెత్తి  తన ఇష్టదైవానికి మనసులోనే నమస్కరించింది.

రైలు సికింద్రాబాద్ వైపు పరుగు తీస్తోంది.